# డాక్టరు బిల్లు

శ్రీమతి ఎస్. లక్ష్మీసుబ్రమణ్యాం

"ఈ కొత్త బంగారు గొలుసు చూశారా?" అంటూ నా భార్య జయ మెడలో ఉన్న గొలుసు పట్టుకొని చూపింది.

"కొత్తదా?"

"అవును. వాళ్ళింట్లో, వాళ్ళ ఎవటనే చేయించారు. రెండు సవర్లుంటుంది. చాలా నాజూకుగా ఉన్నది".

ఆ గొలుసుకేసి ఒకసారి చూసి. రోగులను చూసుకునేటందుకు డిస్పెన్సరీకి వెళ్ళాను.

జయ సాంబశివం కూతురు. రెండు నెలల క్రితం అతని భార్యకు చికిత్స చేశాను. అరవై రూపాయలకు బిల్లు ఇచ్చాను. అతను నాకు ముప్ఫై రూపాయలిచ్చాడు. ఆ తరవాత ఎందుకో మొహం తప్పిస్తూ వచ్చాడు. బాకీ వసూలు చెయ్యటానికి ఎప్పుడు నా నౌకరు వెళ్ళినా అతను ఇంట్లో ఉండేవాడు కాడు.

అతనికి బాకీ తీర్చాలని లేదని నేను గ్రహించాను. డాక్టరు బిల్లు చెల్లించటం ఎవరికీ ఇష్టం ఉండదు! డాక్టర్లు వట్టి నీళ్ళకే డబ్బు గుంజుతారని సాధారణంగా అనుకుంటారు! సాంబశివం గుమాస్తా; కొద్దిపాటి రాబడి గలవాడు. ఇది తెలిసే నేను ఆటే పెద్ద బిల్లు పంపలేదు. అతను అదికూడా ఎగగొట్టాలని చూసేసరికి నాకు కష్టం తోచింది. అంతా ఒక్కసారిగా ఇవ్వలేకపోతే అప్పుడు కాస్తా, అప్పుడు కాస్తా ఇవ్వవచ్చుగద. ఇంతకూ అతను బీదస్థితిలో ఉన్నాడా అని! నేను మాత్రం అతను పిలిస్తే వెళ్ళదలచలేదు. కావలిస్తే ఇంకొక డాక్టరువద్దకు వెళ్ళనీ. ఇటువంటి ప్రవర్తన ఎవరు సహిస్తారు!

మామూలు ప్రకారం జయ వచ్చి నాభార్యతో ఆడుకుంటూనే ఉన్నది. ఆ పిల్ల దాదాపు ప్రతి సాయంకాలమూ మా ఇంట్లోనే గడిపేది. మాకు ఇంకా సొంత పిల్లలను కనే భాగ్యం కలగలేదు.

ఒక నెల గడిచింది. రాత్రి ఎనిమిది గంటలయింది. నేను భోజనం చేసి, ముందుగదిలో కూచుని ఉత్తరం రాసుకుంటున్నాను. ఎవరో తలుపు తట్టటం వినిపించింది. నేను లేచి వెళ్ళి తలుపు తీశాను. వచ్చినది సాంబశివం. అతను నాకేసి చూడటానికి సిగ్గుపడ్డాడు. ఏదో కొంపమీదికి వచ్చిందనీ. నన్ను వెంటనే బయలుదేరి రమ్మని పిలవ వచ్చాడనీ గ్రహించాను. అతను ఆందోళన పడుతూ చివరకు, "డాక్టరుగారూ. దయచేసి మా యింటికి ఒకసారి వస్తారా?" అని అడిగాడు.

"ఎందుకూ?" అన్నాను. నా గొంతు అంత కర్కశంగా ఎన్నడూ ఉండేదికాదు.

"డాక్టరుగారూ, జయకు జ్వరం వచ్చింది. పొద్దుటినుంచీ నలతగానే ఉన్నది. ఇప్పుడు దాదాపు స్పృహ లేదు."



అతనికి సహాయం చెయ్యాలని నా కేమాత్రమూ లేదు. అతని ఇంటికి వెళ్ళగూడదని తీర్మానించుకుని వారమే అయింది. ఆ తీర్మానానికి ఇంతలోనే పరీక్ష జరుగుతుందని నేను అనుకోలేదు.

"జయకు స్పృహలేదు" ఈ వార్త నన్ను కలవరపరిచింది. నేను నా కోప మంతా మరిచి, సంచి తీసుకుని అతని వెంట బయలుదేరాను. మేము వీధిలోకి వచ్చేసరికి నా మనస్సు విరుద్ధ భావాల మధ్య సంఘర్షణ పడుతున్నది — ఒక వంక సాంబశివంపై నాకుగల దురభిప్రాయం, ఇంకొకవంక జయపైన నాకు గల మమకారం. ఆ పిల్లకోసం ఏమైనా చెయ్యగలను గాని అతనంటే మంట.

నేలపైన చాపమీద బిడ్డ పడుకుని ఉన్నది; ఆమె ముఖం పాలిపోయి ఉన్నది. టెంపరేచరు చాలా జాస్తిగా ఉన్నది. పిల్ల సంధిమాటలు మాట్లాడు తున్నది. నేను రావలిసినంత త్వరగా రాలేదేమో ననుకున్నాను. "ఇంకా ముందే నన్నెందుకు పిలవలేదూ?" అని విసుక్కున్నాను.

సాంబశివం నాకేసి చూడలేకపో యాడు. అతను అవమానంతో తల వంచుకున్నాడు. అతను పొందిన అవ మానం నాకేదో సంతృప్తి నిచ్చింది. నేను నిర్దయగా ప్రవర్తించటం తనకు తగిన శిక్షే నని అతను ఆ సమయంలో అనుకుని ఉండాలి. నేను నా ఆలోచన లను కట్టిపెట్టి, పిల్లకు ఒక ఇంజెక్ష నిచ్చాను. తరవాత అతనికి ఒక మందు రాసి ఇచ్చాను. నా దగ్గిర ఆ మందు ఉన్నది. కాని దాన్ని అతనికివ్వటం నా కిష్టం లేకపోయింది. అతను కనీసం ఈ బిల్లయినా ఇచ్చుకుంటాడన్న నమ్మకం నాకు లేకపోయింది.

"దీని ఖరీదెంత ఉంటుంది, డాక్టరు గారూ?"

"ఇరవై రూపాయలదాకా ఉంటుంది. కాని సులువుగా దొరకదు. అమ్మేవాళ్లు నలభై రూపాయలదాకా కూడా అడగ వచ్చు. స్టాకులో లేదనికూడా అనవచ్చు".

సాంబశివం నాచేతులు పట్టుకున్నాడు. అతని ముఖంలో దైన్యం తాండవిస్తు న్నది. నా దగ్గిర మరికాస్త చనువున్న ట్టయితే ఏడిచేసేవాడనుకుంటాను.

"డాక్టరుగారూ, ఈసారికి సహాయం చెయ్యండి. ఈ మందుగానీ, దీనికి బదు లుగా మరొకమందుగానీ, మీదగ్గిర ఉంటే దయచేసి ఇవ్వండి. దాని ఖరీదు రేపే మీకిచ్చుకుంటాను. మీ పాతబాకీకూడా తీర్చేస్తాను."

నేను మెత్తబడ్డాను. పిల్లకేసి చూశాను. దానికి నా సహాయం అవసరం. చికిత్స ఆలస్యమైతే ఏం జరిగినా జరగవచ్చు. పిల్లస్థితి కొంచెం బాగుపడి వ్యాధి అదుపు లోకి వచ్చినదాకా నేను పిల్లదగ్గిరే ఉండి పోయాను.



మర్నాడతను మా యింటికొచ్చాడు. అతను తనవెంట అరవై రూపాయలు తెచ్చాడు. నేను కిందటిరాత్రి ఇచ్చిన మందు ఖరీదుతోబాటు పాతబాకీ కూడా ఇచ్చేశాడు. నా ధర్మం నేను నిర్వర్తి స్తానే సాంబశివంకు మంచి గుణపాఠం నేర్పాను. నాకు ఎంతో తృప్తికలిగింది. నెలాఖరులో వైద్యం చేసినదానికి బిల్లు పంపాను. సొమ్ము వెంటనే వస్తుందని నాకు తెలుసు. అలాగే జరిగిందికూడా.

బిల్లు చెల్లించటానికి అతను స్వయ ముగా వచ్చాడు. వెంట జయనుకూడా తీసు కొచ్చాడు. ఆమె బలహీనంగా కనబ డింది. ముఖం పాలిఉన్నది. ఆమె చిరు నవ్వు నవ్వింది. అప్పుడే చూశాను — బంగారు గొలుసులేదు. నాకు వెంటనే మాట రాలేదు. ఆ పిల్ల నా భార్యవద్దకు వెళ్ళిపోయింది. నేనింకా ఆలోచిస్తూనే ఉన్నాను. చిట్టచివరకు. "గొలుసేదీ?" అని అడిగాను.

"ఏ గొలుసు? ఓహో, బంగారు గొలుసా? అది ఎలా వచ్చిందో, అలాగే పోయింది."

"అంటే?"

"మా అక్క వచ్చి కొద్దిరోజులు మా ఇంటో ఉన్నది. ఆవిడకు జయమీద ఏదో ప్రత్యేకమైన అభిమానం ఏర్పడింది. ఆవిడ వెళ్ళిపోతూ పుట్టినరోజు కానుక కింద బంగారుగొలుసు ఇచ్చి వెళ్ళింది. జయకు అదంటే చాలా ఇష్టం."

"ఆఁ, అయితే?" అన్నాను.

"దానికి అకస్మికంగా జబ్బుచేసింది గద. మందు డబ్బులకోసం ఎక్కడికి పోను? కాస్తాకూస్తా మొత్తం కాదాయె. గొలుసు తాకట్టుపెట్టి డబ్బు తెచ్చాను. కాని నేను దాన్ని విడిపించగల నని తోచదు. అది పోయినట్టే."

"మరి పిల్ల దానికోసం అడగటం లేదూ?"

"అవును, అడిగింది. ఒకటి రెండు సార్లు ఏడిచిందికూడా. ఎలాగో దాన్ని సమదాయించాం; అది దాని సంగతే మరిచిపోయింది. మళ్ళీ అడగలేదు."

అకస్మాత్తుగా నాలో ఘోరంచేసిన భావం పొంగివచ్చింది. నాది మానవ ప్రవర్తనేనా అన్న అనుమానంకూడా కలిగింది. అతను తెచ్చిన డబ్బు తీసుకో లేదు. డ్రాయరు తెరిచి దానిలోనుంచి అరవై రూపాయలు పైకితీశాను. అతని కిచ్చాను. అతను నివ్వెరపోయి, "దేని కండీ?" అన్నాడు.

"తీసుకోండి. జయ మా బిడ్డమాత్రం కాదా? మేమలాగేఅనుకుంటూవస్తున్నాం. ఆ గొలుసు తెచ్చి అమ్మాయి కివ్వండి."

నా కళ్ళు చెమ్మగిల్లాయి. చేతిలో బిస్కట్టు పట్టుకుని జయ పరిగెత్తుకుంటూ వచ్చింది. నేను చప్పున అతనితో, "నేను డబ్బిచ్చినట్టు ఎవరితోనూ అనవద్దు", అన్నాను. నేను నా ధర్మం నిర్వర్తించా నన్న తృప్తి కలిగింది. నా అంతరాత్మ శాంతించింది. నేనా పిల్లను ఎత్తుకు న్నాను. కొంతకాలంగా నాలో లోపించిన మనశ్శాంతి తిరిగి నెలకొన్నది.